## క్లుప్తంగా

### ప్రజలందరికీ దుర్గాదేవి ఆశీస్సులు

**తిరుపతి అర్బన్:** జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో పెంచల కిషోర్ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గాదేవి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ నిండుగా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలు, సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు.

### సంగీత విభావరి

**చంద్రగిరి(తిరుచానూరు):** దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామంలో శుక్రవారం తిరుపతి జ్ఞానదా కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. పలు కీర్తనలు, పాటలను హిమబిందు, సృజన, భగత్, జ్ఞానద, వర్షిక, లిఖిత్ దత్త, కుషాల్ కష్ణ తమ గానంతో మైమరిపించారు. దేవానంద్, హరి కాదిరి వాయిద్య సహకారం అందించారు. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించారు.

### గానం.. భక్తి పరవశం



గానం చేస్తున్న వరలక్ష్మి బృందం

**తిరుపతి కల్చరల్:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొంకావీధిలోని సాయి మందిరంలో శుక్రవారం న్యూఢిల్లీ ఆలిండియా రేడియో గాయని వరలక్ష్మి బృందం సాయినాథుని సంకీర్తనల ఆలాపన ఆద్యంతం భక్తి పారవశ్యాన్ని నింపింది. ఆరు గంటల పాటు ఏకధాటిగా సంకీర్తనల ఆలాపనతో మంత్రముగ్ధుల్ని చేసిన వరలక్ష్మి బృందాన్ని సాయిబాబా సేవా సమాజ్ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం, విజయలక్ష్మి తదితరులు సత్కరించారు.

### మద్యం దుకాణాలకు 158 దరఖాస్తులు

**భాకరాపేట :** చంద్రగిరి ప్రొహిబిషన్, ఎక్సైజు సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలకు 158 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ ఫణీంద్ర తెలిపారు. శుక్రవారం సాయంత్రం గడువు ముగిసే సమయానికి చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలకు సంబంధించి 17 దుకాణాలకు గాను ఈ దరఖాస్తులు వచ్చినట్లు ఆయన చెప్పారు. చంద్రగిరి మండలంలోని 7 దుకాణాలకు 81, పాకాల మండలంలోని 5 దుకాణాలకు 28, చిన్నగొట్టిగల్లు మండలంలోని 3 దుకాణాలకు 28, ఎర్రావారిపాళెం మండలంలోని 2 దుకాణాలకు 21 దరఖాస్తులు అందినట్లు వివరించారు. గురువారం సాయంత్రానికి 95 దరఖాస్తులు రాగా శుక్రవారం గడువు ముగిసే సమయానికి 63 ఒక్క రోజే వచ్చాయన్నారు.

# తెలుగు భాషా వికాసం మరింత ముందుకు..



సింగరాజు సచ్చిదానందం శత జయంతి సంచికను ఆవిష్కరిస్తున్న భూమన, పలువురు ప్రముఖులు

- సచ్చిదానందం రచనలపై వక్తలు
- శతజయంతి సంచికను ఆవిష్కరించిన టీటీడీ మాజీ చైర్మన్ భూమన

**తిరుపతి కల్చరల్:** సింగరాజు సచ్చిదానందం శతజయంతి వేడుకలు శుక్రవారం సాయంత్రం ఓ హోటల్లో ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు, సచ్చిదానంద శిష్యులు హాజరై ఆయన సేవలను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. టీటీడీ పాలక మండలి మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సచ్చిదానంద శతజయంతి సంచికను ఆవిష్కరించారు. ఆ సంచిక మొదటి ప్రతిని సచ్చిదానంద పెద్దకుమారుడు మృత్యుంజయశర్మకు అందజేశారు. అలాగే సచ్చిదానంద రచన వ్యాసాష్టకం అనే గ్రంథాన్ని జాతీయ సంస్కృతి వర్శిటీ కులపతి ఆచార్య జి. కృష్ణమూర్తి ఆవిష్కరించారు. సభాధ్యక్షత వహించిన భూమన మాట్లాడుతూ, సచ్చిదానందం శిష్యుడిగా తనకు అన్ని విధాలా గురువుకు సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు ఆయన మార్గదర్శకత్వంలో ఎన్నో సాహసాలు చేశానని, అంతేకాకుండా గురువు పార్థివ దేహాన్ని మోయడం జీవితంలో ఎన్నటికీ మరచిపోలేనన్నారు. జాతీయ సంస్కృత వర్శిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్.కృష్ణమూర్తి మాట్లాడుతూ, సచ్చిదానందం తన రచనల్లోనూ, వ్యక్తిత్వంలోనూ రాజాధిరాజుగా నిలిచారని ప్రస్తుతించారు. సర్వోత్తమరావు మాట్లా డుతూ, టీటీడీ తెలుగు ప్రాజెక్టుల విషయాల్లో సచ్చిదానందంతో తన అనుభవాలను పంచుకున్నారు. భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ, సచ్చిదానందం రచనలతో తెలుగు భాషా వికాసం మరింత ముందుకు వెళ్లిందన్నారు. మాజీ డెప్యూటీ ఈఓ మౌని మాట్లాడుతూ, సచ్చిదానందం టీటీడీలో తెలుగు భాషా వికాసానికి ఎనలేని సేవలు అందించారని స్మరించారు. కార్యక్రమంలో డాక్టర్ సముద్రాల దశరథ, మన్నవ గంగాధర్, సంస్కృతి విద్యాపీఠం అధ్యాపకులు జూలకంటి బాలసుబ్రమణ్యం, డాక్టర్ సింగరాజు దక్షిణామూర్తి, డాక్టర్ అల్లాడి సంధ్య, తూమాటి సంజీవరావు, సింగరాజు వెంకటకుమార్ పాల్గొన్నారు.

# 'మట్టి చెట్టు మనిషి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీ వేత్తలు

**తిరరుపతి కల్చరల్:** మానవతావాదానికి మించిన సాహిత్య వాదం లేదని, దీనికి పట్టం కట్టిన కవి త్యాగదుర్గం మౌని అని రచయిత తిరువాయపాటి రాజగోపాల్ అన్నారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కరకంబాడి రోడ్డు స్టేట్ బ్యాంక్ కాలనీలోని నాయుని కృష్ణమూర్తి ప్రాంగణంలో డాక్టర్ మౌని కవితల సంపుటి 'మట్టి చెట్టు మనిషి' పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగ రాజ పుస్తక సమీక్ష చేశారు. మనిషి జీవిత పార్శ్వాలన్నింటినీ మౌని కవిత్వం దృశ్యమానం చేస్తుందన్నారు. అమ్మ తత్వాన్నే కవిత్వంలో నింపుకుని సాహితీ ప్రస్థానం సాగిస్తున్నట్టు పుస్తక రచయిత చెప్పారు. జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు గార్లపాటి దామోదర నాయుడు, అధ్యక్షుడు సాకం నాగరాజు, తోట వెంకటేశ్వర్లు, ఏనుగు అంకమ నాయుడు, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆర్‌సీకే.రాజు, నెమిలేటి కిట్టన్న, జయరాం ప్రసాద్, గాలి గుణశేఖర్ నాయుడు, గజేంద్రరెడ్డి, మునిప్రసాద్ పాల్గొన్నారు.

# స.హ.చట్టం.. ప్రజల చేతిలో పాశుపతాస్త్రం

**తిరుపతి కల్చరల్:** హక్కుల పరిరక్షణలో ప్రజల చేతిలో పాశుపతాస్త్రం సమాచార హక్కు చట్టమని, దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి.రాజారెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం ఐక్య వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'ప్రజలారా మేల్కొనండి.. సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోండి' అనే కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. రాజారెడ్డి మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో అన్నా హజారే, అరుంధతి రాయ్ తదితర సామాజిక కార్యకర్తల ఉద్యమం ఫలితంగా సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిందన్నారు. సామాన్య ప్రజలకు ఏ సమాచారాన్నైనా శీఘ్రంగా, సులభంగా అందించి, అవినీతి, అధికార దుర్వినియోగాన్ని, బాధ్యతారాహిత్యాన్ని అరికట్టడం ఈ చట్టం ఉద్దేశమన్నారు. సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసులు, ఉద్యమకర్తలు కుమారస్వామి నాయుడు, మునిచంద్రారెడ్డి, ఉపేంద్ర, మురళీ మోహన్ మాట్లాడారు. కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ చట్టాన్ని దుర్వినియోగం చేయడం తగదన్నారు.

# మహిషాసురమర్దినిగా గంగమ్మ దర్శనం

**తిరుపతి కల్చరల్:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం తాతయ్యగుంట గంగమ్మ మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, దేవీ హోమం, సహస్ర నామార్చన, రాత్రి ఉయ్యాలసేవ నిర్వహించారు. విజయ దశమి పురస్కరించుకుని శనివారం రాత్రి అమ్మవారు రాజ రాజేశ్వరిదేవి అలంకరణతో 7 గంటలకు పుర విహారం చేస్తారని ఈఓ ఏ.జయకుమార్ తెలిపారు.

**దుర్గాదేవిగా ఎల్లమ్మ విహారం**

**చంద్రగిరి:** చంద్రగిరి గ్రామ దేవత మూస్థాన ఎల్లమ్మదేవి నవరాత్రి ఉత్సవాల్లో 8వ రోజు శుక్రవారం రాత్రి దుర్గ అవతారంలో అమ్మవారు పూలరథంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, మూలమూర్తికి అభిషేక సేవ నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, చేగు కుటుంబ సభ్యులు, స్వర్ణాంబ, రామనరసింహారావు, మీన మ్మ, సదాశివ రెడ్డిలు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్, ఈఓ మమత, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.







మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిస్తున్న తాతయ్యగుంట గంగమ్మ, అన్నారావు సర్కిల్లోని శ్రీబ్రహ్మంగారి ఆలయంలో శుక్రవారం మహిషాసుర మర్దిని అలంకారంలో శ్రీపోలేరమ్మ తల్లి.
చంద్రగిరి: దుర్గ అలంకరణలో పూలరథంపై విహరిస్తున్న మూలస్థాన ఎలమ్మ



### బ్రహ్మోత్సవాలలో నేడు

**తిరుమల:** తిరుమలలో నిర్వహిస్తున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజావరోహణంతో పరిసమాప్తమవుతాయి. తొలుత ఉదయం 6 నుంచి 9 గంటల వరకు స్వామివారి పుష్కరిణలో చక్రస్నానం కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహిస్తారు.



# చాముండేశ్వరికి సారె సమర్పణ



శక్తి చాముండేశ్వరి అమ్మవారికి సారె తీసుకువచ్చిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్ రెడ్డి

**తిరుపతి రూరల్:** తిరుపతి నగరపాలక సంస్థ లింగేశ్వరనగర్ సమీపంలోని శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సారెను సమర్పించారు. ప్రతి ఏటా పాటిస్తున్న సంప్రదాయం మేరకు ఆలయ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పట్టువస్త్రాలు, పసుపు కుంకుమలతో కూడిన సారెను అమ్మవారికి తీసుకువెళ్లారు. అయితే శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండటం, కంకణధారుడైన చెవిరెడ్డి ఆచారం ప్రకారం గ్రామ పొలిమేరలు దాటరాదు. ఈ కారణంగా ఆయన గ్రామ శివార్ల వరకు సారెను తీసుకువచ్చారు. ఆపై అమ్మవారి ఆలయం వరకు చెవిరెడ్డి చిన్న కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సారెను తీసుకువచ్చి సమర్పించారు. ఆలయం వద్ద ధర్మకర్త బిరుదాల భాస్కర్ రెడ్డి వారికి సాదరం స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలను, పసుపు, కుంకుమలను అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెవిరెడ్డి కుటుంబీకులు, తుమ్మలగుంట గ్రామస్తులు పాల్గొన్నారు.